క్లుప్తంగా

బాణసంచా తయారీ షాపుల్లో తనిఖీ


గోరింటలోని తనిఖీ చేసిన అధికారులు

పెద్దాపురం(సామర్లకోట): జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు శనివారం పెద్దాపురం మండల పరిధిలోని బాణసంచా తయారీ షాపులను అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు షాపుల లైసెన్సు గడువు, ఎన్‌ఓసీ, కార్మికులకు బీమా పత్రాలను పరిశీలించారు. మండల పరిధిలో జి.రాగంపేట, గోరింట, వడ్లమూరు గ్రామాలలోని బాణసంచా తయారీ షాపులకు సంబంధించిన వివరాలను కలెక్టరుకు అందజేస్తామని తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. కలెక్టరు నుంచి అనుమతులు వచ్చే వరకు బాణసంచా తయారీ నిలుపుదల చేయాలని సూచించారు. బాణసంచా తయారీలో నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి ఎం.శ్రీహరిజగన్నాద్, ఎస్సై మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శారిస్ స్క్రీన్ పెయింటింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

సామర్లకోట: స్థానిక భీమేశ్వర–సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శారిస్ స్క్రీన్ పెయింటింగ్ శిక్షణ ఇస్తున్నట్టు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాస రావు శనివారం తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. చీరలపై నచ్చిన విధంగా అందమైన డిజైన్లు, పెయింటింగ్‌లు ఇంటి వద్దనే వేసుకొనే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కోర్సు నేర్చుకోవడానికి ఎటువంటి చదువు అవసరం లేదని, మిషనరీ ఖర్చు కూడా ఎక్కువగా ఉండదని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రిజిస్ట్రేషన్, మెటీరియల్ ఫీజుగా రూ.300 చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి


ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేసిన స్టేషన్ మేనేజరు, హెల్త్ ఇన్‌స్పెక్టరు

సామర్లకోట: రైల్వే ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. శనివారం సాయంత్రం రైల్వే ప్లాటు పారాలపై తాగునీరు విక్రయం చేస్తున్న ఆర్వో ప్లాంటును హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ మేరకు ప్లాటు పారాలపై లీటరు వాటర్ రూ.ఐదుకు విక్రయం చేస్తున్న స్టాల్స్ పరిశీలించి తాగునీటి శ్యాంపిల్స్ సేకరించారు. ప్రయాణికులకు హాని కలిగేలా తాగునీరు, పదార్థాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి పనులు


రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో రూ.10లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం పట్టణ పరిధిలో 28వ వార్డు నూకాలమ్మ ఆలయం రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీకి మంజూరు అయిన నిధులతో రోడ్లు, డ్రైన్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రెడ్నం సునీత, బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, సరోజ్‌వాసు, బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కరప: గొడ్డటిపాలెంలో శనివారం పేరూరి కర్ణుడు, రాఘవమ్మ, కల్యాణలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన విరాళాలతో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు ఆవిష్కరించి, బుద్ధపార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న బుద్ధపార్క్‌కు అవసరమైన నిధులు సమకూర్చి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ఎస్సీలందరూ ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల వినతి మేరకు యువతకు వాలీబాల్ కిట్లను డైరెక్టర్ అప్పారావు బహూకరించారు. మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బుంగా సింహాద్రి, ఎం.మనోజ్, వీరంరెడ్డి ముత్యాలరావు, పులపకూర శుభామహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాస్త పట్టించుకుంటే కాసులే..

- నిర్లక్ష్యం నీడలో పెద్దాపురం టీటీడీ కల్యాణ మండపం
- రీమోడలింగ్ చేస్తే అధిక అద్దె వచ్చే అవకాశం
- శ్రద్ధ చూపని అధికారులు


నిరుపయోగంగా ఉన్న పెద్దాపురం టీటీడీ కల్యాణ మండపం


కల్యాణ మండపం ఆవరణలో పెరిగిపోయిన తుప్పలు

సామర్లకోట: ఒకప్పుడు పెళ్లిళ్లకు ఇంటి వద్దే పందెళ్లు వేసి, అందంగా అలంకరించి ఘనంగా జరుపుకొనేవారు. ప్రస్తుతం కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా కల్యాణ మండపాలపై మక్కువ చూపుతున్నారు. అయితే ప్రజలకు అనుగుణంగా ప్రభుత్వ కల్యాణ మండపాలను ఎందుకు అందుబాటులోనికి తీసుకురావడం లేదో అర్థం కావడం లేదు. విశాలమైన స్థలాలతో ఏర్పాటు చేసిన టీటీడీ కల్యాణ మండపాలు ప్రజలకు అందని ద్రాక్షగా మారాయి. నేదుల మల్లి జనార్దనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెద్దాపురం ఎమ్మెల్యే పంతం పద్మనాభం దేవదాయ శాఖ మంత్రి కావడంతో అప్పటిలో పెద్దాపురం, సామర్లకోట, కిర్లంపూడిలో కల్యాణ మండపాలను అందుబాటులోనికి తీసుకువచ్చారు. ఈ కల్యాణ మండపాలు విశాలమైన స్థలంలో నిర్మించారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అందులో సామర్లకోటల కల్యాణ మండపం సక్రమంగా పనిచేస్తుండగా పెద్దాపురంలో మండపం నిరుపయోగంగా మారింది.

పెద్దాపురం మున్సిపల్ సెంటర్, బస్సు కాంప్లెక్స్ సమీపంలో కల్యాణ మండపం నిర్మించారు. ఈ మండపం చెరువును పూడ్చి వేసి నిర్మించారు. అప్పట్లో నిర్మాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కల్యాణ మండలం భోజనశాల ప్రదేశం కిందికి దిగిపోయింది. దానిని వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యంతో వదలి వేశారు. దాంతో గతంలో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేసి రంగులు వేసి వినియోగంలోనికి తీసుకువచ్చారు.

పార్కు సదుపాయాలతో..

ఒకే పర్యాయం మూడు వందల మంది భోజనాలు చేసే విధంగా పెద్దాపురం కల్యాణ మండపం నిర్మించారు. మొదటి అంతస్తులో వివాహం చేసుకోవడానికి వేదికను ఏర్పాటు చేసి దిగువ భాగంలో భోజనాలు చేసే విధంగా ఏర్పాటు చేశారు. దీనికి తోడు కల్యాణ మండపానికి ఇరువైపులా విశాలమైన ఖాళీ స్థలం ఉండడంతో వేసవి కాలంలో ఆరు బయట భోజనాలు చేయడానికి విశ్రాంతి తీసుకోవడానికి ఎంతో అనువుగా ఉంటుంది. దీనికి తోడు వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలం ఉంది. ప్రైవేటు కల్యాణ మండపాల వద్ద పార్కింగ్ సదుయాలు లేక పోవడంతో వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు.

అధికారులు శ్రద్ధ చూపితే..

టీటీడీ కల్యాణ మండపంలో పెళ్లిళ్లు చేసుకొంటే తిరుపతిలో చేసుకొంటున్న అనుభూతి ఉండేది. పెద్దాపురం టీటీడీ కల్యాణ మండపం రోజుకు రూ.2 వేల అద్దె ప్రాతిపదికలో ఈ కల్యాణ మండపాలు ఉండడంతో పేద, మధ్య తరగతి వారి అవసరాలు తీర్చడానికి ఎంతో ఉపయోగపడేవి. వీటికి ఏసీలు ఏర్పాటు చేసి రూ.10వేల వరకు అద్దె నిర్ణయం చేసినా ఎవరికి ఇబ్బంది ఉండదనే వాదనలు ఉన్నాయి. ప్రైవేటు ఏసీ కల్యాణ మండపాలు రూ.40 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు అద్దెలు ఉన్నాయి. ప్రైవేటు కల్యాణ మండపాల నిర్వాహకులకు కుమ్మక్కు కావడం వలనే టీటీడీ అధికారులు ఈ కల్యాణ మండపాలకు ఏసీలు ఏర్పాటు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కల్యాణ మండపం వినియోగంలో ఉన్నా ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉంది. గేటుకు తాళాలు వేసి ఉండడంతో ఉపయోగంలో లేదని అనేక మంది భావిస్తున్నారు. దాంతో ఆవరణలో తుప్పలు పెరిగిపోయాయి.

అద్దె తెలిసి ఆశ్చర్యపోయా..



పెద్దాపురం కల్యాణ మండపం రోజుకు రూ.రెండు వేలు మాత్రమే అద్దె అని తెలిసి ఆశ్చరపోయా. అద్దెకు సంప్రదించడానికి కల్యాణ మండపం వద్ద ఎవరూ ఉండడం లేదు. బోర్డుపై ఉన్న నంబరుకు ఫోన్ చేస్తే మరో నంబరు ఇస్తున్నారు. ఆ నంబరుకు ఫోన్ చేస్తే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని చెబుతున్నారు. కల్యాణ మండపం వద్ద సిబ్బందిని నియమిస్తే ఉపయోగంలో ఉందని తెలుస్తుంది. నిర్మాణం జరిగిన తరువాత వాటి నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో విచారకరం. టీటీడీ కల్యాణ మండపాలపై దృష్టి పెట్టి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోనికి తీసుకు రావాలి.

– వాసంశెట్టి గంగ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, పెద్దాపురం

టీటీడీకి లేఖ రాస్తాం



నియోజకవర్గంలో ఉన్న రెండు టీటీడీ కల్యాణ మండపాలను రీమోడలింగ్ చేస్తే బాగుంటుంది. అద్దె ఎక్కువగా వస్తుంది. దీనిని టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లతాం. కల్యాణ మండపాలకు ఏసీలు ఏర్పాటు చేస్తే డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు మున్సిపాలిటీ నుంచి ఒక లేఖ రాస్తాం. తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపాల పవిత్రను కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉంది. ఏసీలు ఏర్పాటు చేసి రూ.అద్దె రూ.20 వేలు చేసినా ఎవరికి సమస్య ఉండదు. టీటీడీ కల్యాణ మండపం విశాలమైన స్థలంలో ఉంది. పార్కింగ్ సదుపాయం ఉంది.

– నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్, పెద్దాపురం

వంగ గీతకు కృతజ్ఞతలు


గీత, చిన్నారావు, నారాయణరెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండలానికి చెందిన రావు చిన్నారావు, వడిశెట్టి నారాయణరెడ్డిలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా నియమాకానికి కృషి చేసిన మాజీ ఎంపీ, పిఠాపురం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీతకు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడలోని ఆమె స్వగృహంలో పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. తమపై ఉన్న నమ్మకంతో ఈ పదవులు ఇచ్చినందుకు పార్టీకి కట్టుబడి గ్రామ స్థాయినుంచి పార్టీ అధివృద్ధికి కృషి చేస్తామన్నారు. కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన చిన్నారావు, నారాయణరెడ్డిలను వైఎస్సార్ సీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, నాగులాపల్లి సర్పంచి వడిశెట్టి గౌరీ రాజేశ్వరి ఉన్నారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం


కౌన్సిల్ సమావేశానికి హాజరైన పాస్టర్లు

సామర్లకోట: అంతర్జాతీయ పాస్టర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ మేరకు స్థానిక ఆంధ్ర జూబ్లీ బాప్టిష్టు సంఘం ఆవరణలో ఫీల్డు కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పాస్టర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బాప్టిస్టు సంఘ పాస్టర్లు బీవీ రాజు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ వందనం, టీ సూర్యారావు, ఐఈ జీవన్‌కుమార్, పిట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేస్తే ఊరుకోం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ
- పిఠాపురంలో అనూహ్య స్పందన


కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు


మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకం చేస్తున్న వంగా గీత

పిఠాపురం: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తే ఊరుకునేది లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాష్ట్ర మహిళా విభాగం జోన్–2 వర్కింగ్ ప్రెసిడెంట్ వంగా గీత హెచ్చరించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం పిఠాపురంలో వైఎస్సార్ సీపీ నేతలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఠాపురం పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. పిఠాపురం 1, 30 వ వార్డుల్లో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భగా వంగా గీత మాట్లాడుతూ పేదల కోసం వైద్య విద్యను పెంచి తద్వారా వైద్యాన్ని పేద ప్రజలకు చేరువ చేయాలనే దృక్పదంతో మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా చేయలేని విధంగా ఒకే సారి 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించి నిర్మాణాలు చేస్తుంటే దానిని ప్రోత్సహించకుండా ప్రైవేటుకు అప్పగించాలని చూడడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాలకు వైద్య విద్యను, వైద్యా సదుపాయాలను అందకుండా చేసి, వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకానికి పెట్టిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గతంలో వైద్యం అందరికి అందాలని, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు పెరగాలని బావించి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం ప్రారంభించారన్నారు. వాటిలో కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకుని క్లాసులు కూడా జరుగతున్నాయన్నారు. అటువంటి వాటిని ప్రైవేటుకు దారాదత్తం చేస్తు కూటమి ప్రభుత్వం పేదలపై కక్ష సాధిస్తుందన్నారు. ఎప్పుడు ఎక్కడా లేని విధంగా వైద్యుల నియామకం, వైద్య పరికరాల ఏర్పాటు, ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి ఒక్క జగన్ హయాంలోనే జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా ప్రభుత్వ వైద్యం కుటంపడిందని ఆమె విమర్శించారు. ఆమె తొలి సంతకం చేసి కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు గండేపల్లి రామారావు బాబి, రావు చిన్నారావు, రాష్ట్ర యూత్ జాయింట్ శక్రటరీలు మాదిరెడ్డి దొరబాబు, ఉలవల భూసనం, కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్దినిడి సుజాత, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, జిల్లా ఆర్గానేజినల్ సెక్రెటరీ కొత్తేం దత్తుడు, స్టేట్ ఎస్సీసెల్ సెక్రెటరీలు శెట్టిబత్తుల సురేష్ కుమార్, లోడ అప్పలరాజు, పార్టీ నాయకులు వజ్రపు వీరేష్, బత్తిన రాజశేఖర్, జ్యోతుల బాబులు, జెడ్పీటీసీ ఉలవలకాయల నాగ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులొచ్చే వరకూ వేచి ఉండాల్సిందే..

- బాణసంచా షాపులను తనిఖీ చేసిన అధికారులు
- మరుగుదొడ్లు, ప్రహరీ లేవని రిపోర్టు


సామర్లకోట మండలంలో బాణసంచా షాపులను తనిఖీ చేస్తున్న అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ అధికారులు

సామర్లకోట: కలెక్టర్ నుంచి అనుమతులు వచ్చే వరకు బాణసంచా తయారీకి అవకాశం లేదని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి ఎం.శ్రీహరి జగన్నాథ్ అన్నారు. మండల పరిధిలోని బాణసంచా తయారు షాపులను అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసులు అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. సామర్లకోటలో బాబా ఫైర్ వర్క్స్, హుస్సేన్ పురంలోని రామకృష్ణ ఫైర్‌వర్క్స్, వేట్లపాలెంలోని శ్రీవీరవెంకట విఘ్నేశ్వర ఫైర్ వర్క్స్, శ్రీ సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్, శ్రీశివసాయి లక్ష్మీగణపతి ఫైర్‌వర్క్స్‌ను తనిఖీ చేశారు. సామర్లకోటలో బాబా ఫైర్ వర్క్స్‌కు సరైన సర్టిఫికెట్లు లేకపోవడంతో బాణసంచా తయారీని నిలిపివేయాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం బాణసంచా తయారీదారులతో జిల్లా కలెక్టరు నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం నిబంధనలు పాటించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

ఈ మేరకు బాణసంచా తయారీ షాపుల వద్ద ప్రహరీలు, మరుగుదొడ్లు లేవని కలెక్టరుకు నివేదిక అందజేస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా కలెక్టరు నిర్ణయం మేరకు బాణసంచా తయారీ ఉంటుందని, అందాక నిలిపివేయాలని అన్నారు. అనంతరం అగ్నిమాపక పరికరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. షాపుల్లో పని చేసే ప్రతి కార్మికునకు బీమా ఉండాలని, ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణ నష్టం జరగకుండా షాపుల్లో అన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని, అనుభవం లేని వ్యక్తులనే పనుల్లోకి తీసుకోవాలని, ప్రతి షాపులో పని చేసే కార్మికులకు సంబంధించి హాజరు పట్టి ఉండాలన్నారు. బాణసంచా తయారీలో ప్రమాదాలకు కారణం అవుతున్న ముడిపదార్థాలను ఉపయోగించడం మానేయాలని సూచించారు. ప్రతి షాపులలో ప్రభుత్వ నిబంధనలకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బాణా సంచాతయారు చేసి నిల్వ చేసే గొడౌన్‌లను తయారీ ప్రదేశానికి దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ తనిఖీల్లో సీఐ కృష్ణ భగవాన్, వీఆర్వో కామరాజు, అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం


భోగి గణపతి పీఠంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక స్వయంభూ భోగి గణపతి పీఠంలో 108 వారాల జపయజ్ఞ పారాయణ పూర్తి చేసిన సందర్భంగా శనివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీవారి భక్త బృందం పంచలోహాల విగ్రహాలను ఊరేగించి నగర సంకీర్తన చేశారు. అనంతరం సుప్రభాత వేళలో దివ్య కల్యాణ ఉత్సవం పూర్తి చేశారు. అర్చకులు కార్తికేయ శర్మ, రవికుమార్ శర్మ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల పాదయాత్రికుడు గోవింద స్వామి దంపతులు శ్రీవారికి తాంబూలం అందించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ కలియుగ ఆది స్వయంభూ తిరుమల శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర చేసినట్టు చెప్పారు. పీఠంలో గణపతి స్వామికి 16వ వార్షికోత్సవంలో కాంస్య కవచ యజ్ఞం నిర్వహించి 108 వారాల జప యజ్ఞ పారాయణతో శ్రీవారి కల్యాణం జరుపుకొనే అవకాశం వచ్చిందన్నారు. మూడు వేల మందికి అన్నసంతర్పణ జరిగింది. మాతా వీర సత్యవేణి ఆధ్వర్యంలో శ్రీవారి భక్త సమాజం సభ్యులు కల్యాణ వేదికను ప్రత్యేక అలంకరణలతో తోమాల సేవ చేపట్టి అలరించారు. ప్రతి ఏడాది వయోవృద్ధులను తిరుమలకు తీసుకువెళ్లి దర్శనం చేయించే ప్రణాళికను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రాజుకు డాక్టరేట్

కరప: గురజనాపల్లి గ్రామానికి చెందిన, మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజుకు గౌరవ డాక్టరేట్ లభించింది. మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా విద్య, వైద్యం, వసతి, ఆసరా, రక్తదానం వంటి సేవా ర్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. జొన్నలగడ్డ రాజు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ(యుఎస్) వారు గుర్తించి, గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేయగా పాండిచ్చేరిలోని కుంభ కళింగ ఆడిటోరియంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖల ద్వారా గౌరవ డాక్టరేట్‌ను రాజుకు ప్రదానం చేశారు. డాక్టర్ జొన్నలగడ్డ రాజును చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవికుమార్, కార్యదర్శి ఎం.అలీమ్, కార్యవర్గసభ్యుడు చింతా నారాయణమూర్తి, కరపమాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, గురజనాపల్లి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

విశ్వహిందూ రక్ష పరిషత్ నూతన కార్యవర్గం

బాలాజీచెరువు: విశ్వబంధు ట్రస్ట్ అనుబంధ సంస్థ విశ్వ హిందూ రక్ష పరిషత్ (అంతర్జాతీయ ధార్మిక సంస్థ) శనివారం కార్యనిర్వాహక కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. కాకినాడలో ప్రధాన కార్యాలయంలో మహిళా విభాగంలోని సభ్యులు, పురుష విభాగంలోని సభ్యులు రెండు కూడా జై శ్రీరామ్ నినాదంతో ప్రమాణ స్వీకారం చేశారు. మాతృశక్తి విభాగంలో రాష్ట్ర అధ్యక్షురాలిగా నాళం ఆండాళ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుచిత్రమూర్తి బాలాంత్రపు, పురుష విభాగం అధ్యక్షుడిగా చిట్నీడి శ్రీనివాస్ నియమితులయ్యారు. హైందవ ధర్మ సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా మన గుడి మన బలం సంకల్పంతో, సంస్కృ సంప్రదాయాలు పండుగలు, శాస్త్ర రీతిగా ప్రజలలో అవగాహన కల్పిస్తూ మన ధర్మాన్ని మనం నిలబెట్టే దిశగా పనిచేయాలనే మోటోతో అందరూ కూడా ప్రమాణం చేశారు. ముందుగా అంతర్జాతీయ నాయకులు గోపాల్ రాయ్, జాతీయ నాయకురాలు సుభద్రదేవి, యమునా పాఠక్ నడింపలి వందన సమర్పణ చేశారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలు

మాజీ కేంద్ర సహాయ మంత్రి పళ్లంరాజు


పెద్దాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పళ్లంరాజు తదితరులు

సామర్లకోట: దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో భారీ అవకతవకలు జరుగుతున్నాయని, వాటిపై ప్రజలను చైతన్యం చేయడానికి అవగాహన ర్యాలీలు నిర్వహించి, ప్రజల నుంచి సంతకాల సేకరణ చేస్తున్నట్టు మాజీ కేంద్ర సహాయ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు అన్నారు. నియోజకవర్గ పరిధిలో ర్యాలీలో భాగంగా శనివారం ఆయన మున్సిపల్ సెంటర్‌కు చేరుకుని అక్కడ అంబేద్రర్ విగ్రహానికి, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఐదు పర్యాయాల పాటు పెద్దాపురం మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన ముప్పన రామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కేంద్రంగా పళ్లంరాజు మాట్లాడుతూ ఏఐసీసీ పిలుపు మేరకు ఓటర్ల జాబితా అవకతవకలపై ప్రజలలోనికి తీసుకెతున్నామన్నారు. జీఎస్టీ పేరుతో ప్రజలను దొచుకొని, కంటి తడుపుగా తగ్గించి సంబరాలు చేసుకోవడం వింతగా ఉందన్నారు. మున్సిపల్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బుర్రా పద్మనాభం, నియోజకవర్గ కోఆర్డినేటర్ మలకల సూరిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు తోట కరుణాకర్, సామర్లకోట పట్టణ అధ్యక్షుడు సంగినీడి భవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమావేశం


సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు

కాకినాడ రూరల్: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జీపీ శ్వాస సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అక్టోబర్ పదో తేదీన పంచాయతీ రాజ్ వ్యవస్థలో క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి ప్రతి పంచాయతీని యూనిట్‌గా గుర్తించింది. జనాభా ఆధారంగా పంచాయతీలను నాలుగు గ్రేడ్స్‌గా పునర్ వ్యవస్థీకరణ చేస్తూ, పంచాయతీ కార్యదర్శి పేరును పంచాయతీ అభివృద్ధి అధికారి(పీడీ)గా మార్పు చేసింది. ఇలా పలు నూతన సంస్కరణలు తీసుకువస్తూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన పంచాయతీల రీ కేటగిరైజేషన్ ఫైల్‌కు జీపీపి సంఘం పూర్తి స్థాయి హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో జీపీ శ్వాస సంఘ అధ్యక్షుడు ఆది అశోక్, జెనరల్ సెక్రెటరీ రానా నాయుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

90వ సారి రక్తదానం చేసిన లయన్స్ గవర్నర్ బాలకృష్ణ


రక్తదానం చేస్తున్న బాలకృష్ణ తదితరులు

బాలాజీచెరువు: రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని లయన్స్ ఉపగవర్నర్ చిట్టూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక లయన్స్ హాల్లో శనివారం ఆ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు అధ్యక్షతన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్, ప్రముఖ సంఘ సేవలకు డాక్టర్ బాదం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ 90వ సారి రక్తదానం చేసి ప్రతిపుట్టినరోజుకు దాదాపు 80 నుంచి 100 వరకూ యూనిట్ల రక్తాన్ని సేకరించి ఆపదలో అవసరమైన వారికి అందజేస్తున్నామని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. ఒకరి రక్తదానంతో నలుగురి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. లయన్ ఉపగవర్నర్ పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఐబ్యాంక్, మల్టీఆర్గాన్, క్లాత్ అండ్ ఐగ్లాస్ ఉచిత పంపిణీ, మహిళలకు ఉచిత కుట్టుశిక్షణతో పాటు రెడ్ కాన్వెంట్ ట్రస్ ద్వారా లక్షలాది రూపాయలు విద్య, వైద్యానికి సహాయం చేస్తున్న బాలకృష్ణను ప్రతిఒక్కరూ అభినందించాలన్నారు. ముఖ్యంగా నాగమల్లితోట జంక్షన్ సమీపంలో ల్యాబ్ ఏర్పాటు చేసి పేదలకు నామమాత్రపు రుసుంతో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ పూర్వపు గవర్నర్ ఈశ్వరరావు, ఎం.విశ్వేశ్వరరావు, గణేష్, మురళీకృష్ణ, నూకాజీ, మురళీకృష్ణ పాల్గొన్నారు.